
# నా కథ

**ఎస్. హనుమంతరావు**

అవును... నిజమే, మీది ఉరుకులు పరుగుల బ్రతుకే. మీ గురించి మీరే పట్టించుకోలేని పరిస్థితి. ఇక పరాయివాళ్ల సంగతేం పట్టించుకోగలరు? వింటాం సరే! మాకేంటి లాభం అంటారా? లాభం లేంది ఏ పనీ కాదు. అయితే నా కథ మీకు అంతో, ఇంతో మేలే చేస్తుందని ఘంటాపథంగా చెప్పగలను. ఓపిక చేసుకుని కాస్త చెవిన పెట్టండి. నా పేరు... ఊరు... అంటారా? పేరుకేం కాని నేనో మామిడి చెట్టుని. ఇక ఊరు అంటారా? తెలుగుదేశపు తూర్పుతీరంలోని పట్టణం. అదే ఇపుడు నగరంగా విశ్వరూపం చూపిస్తున్న ఊరే మా ఊరు.




సముద్రపు ఒడ్డుకు దగ్గరగా, ఎత్తు ప్రదేశం మీద కట్టిన బంగళా. ఎప్పుడో తెల్లవాళ్లు ఉండగా కట్టిన రాతి బంగళా. చుట్టూ తోట. తోటలో మా మామిడి చెట్లతో పాటు, నేరేడు, కొబ్బరి, ఇంకా అనేకరకాల చెట్లు, పూల, పళ్ల మొక్కలు,

పొదులు... తోటంతా కళకళలాడుతూ ఉండేది. తోట చుట్టూ ప్రహరీ.

బంగళాలో ఓ ముసలి జంట ఉండేది... తెల్లవాళ్లు. ఈ దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా, ముసలాళ్లిద్దరూ ఇక్కడే ఉండిపోయారు. ముసలాయనకి ఓడల మీద ఏదో వ్యాపారం. ఇక ఇంటి పనులకి సింహాచలం. వంటపనికి లండన్ రిటర్న్ బట్లర్ పోలయ్యా (వాళ్ల గ్రామం చిన వాల్తేరులో లండన్‌లో బట్లర్ పని చేసి వచ్చినవాళ్లు చాలామంది ఉండేవారు), తోట బాగోగులు చూడ్డానికి కాపలాకి అనకాపల్లి నూకరాజు. ఇంతే ఆ ఇంట్లో. ఇల్లంతా ఎప్పుడూ ప్రశాంతంగా వుండేది. ఏదో తపస్సు చేసుకుంటున్న మునిపుంగవుడిలా.

దొర, దొరసాని చాలా మంచివాళ్లు. తమ దగ్గర పని చేసే పనివాళ్లని ఎంతో దయతో చూసేవారు. అలాగే, ఊళ్లోవాళ్లతో కూడా చాలా స్నేహంగా ఉండేవారు. ఊళ్లోవాళ్లు కూడా ఆ దంపతులంటే ఎంతో గౌరవంగా ఉండేవారు. పొద్దుటే పెంపుడు కుక్కని తీసుకుని ఓ గంట పాటు సముద్రపు ఒడ్డున నడిచి వచ్చేవారు. దొర సాయంత్రం ఆఫీసు నుంచి వచ్చిన తర్వాత, మళ్లీ ఒక గంట పాటు బీచ్‌లో నడక.

ఇక తోటలో మా చెట్లకి ఎంతో ఆనందంగా గడిచేది. సముద్రం మీంచి చల్లగాలులు రాత్రులు పట్టు శాలువలా పరచుకునే వెన్నెల, పగలు మరీ వేడిమి లేని ఎండ, అపు డపుడు అభ్యంగనస్నానం చేయించే వర్షం, లలితంగా గిలిగింతలు పెట్టినట్లు చలిగాలి. ఓహ్! ఆ రోజులు ఎంత హాయిగా గడిచేవి! తోటలో చెట్లు మొక్కలే కాకుండా, రామ చిలుకలు, గోరువంకలు, పిచ్చుకలు, ఉడుతలు, తొండలు, కొన్ని ఊసరవెల్లులు, ఇంకా ఎన్నో రంగు రంగుల క్రిమి కీటకాలు... ఓహ్! అదో ప్రపపంచం. ఎవరి బ్రతుకు వారిదే గాని, .అదో సహజీవనం!

నేనుండేది ప్రహరీకి కాస్త దూరంగా గోడ పక్కనే వున్న చెట్లకి బయటి ప్రపంచం బాగా కనిపించేది. గోడ పక్కగా పోతున్న రోడ్డు మీద, తెల్లారితే పుస్తకాల సంచీలు భుజాన వేసుకుని జారిపోతున్న లాగూల్ని ఎగ లాక్కుంటూ కేరింతలు కొడుతూ పోయే పిల్లలు, సైకిళ్ల మీద కబుర్లు చెప్పుకుంటూ పోయే ఇస్త్రీ బట్టల ఆఫీసు ఉద్యోగులు, చుట్టలు కాల్చుకుంటూ నడిచిపోయే పల్లెకారులు, బారులు తీరి వెళ్లే ఎడ్ల బళ్లు. ఎడ్ల మెడల్లోని గంటల నుండి లయబద్ధంగా వినిపించే చప్పుడు. రాత్రి పూట ఎక్కడి నుండో వినిపించే ముసలి గాయకుని తత్వాలు. ఎంతో కాలక్షేపంగా ఉండేవి. గోడకి కాస్త దూరంగా వుండే నాలాంటి చెట్లకి, ఇలాంటి కాలక్షేపం దొరకడం కొంచెం అపురూపమే!

ఉన్నట్లుండి తెల్ల దంపతులు ఆ ఇంటిని అమ్మకానికి పెట్టేసి, వాళ్ల దేశం వెళ్లి పోయారు. వెళ్లిపోయే రోజు, ఇద్దరూ గుడ్ల నీరు కక్కుకుంటూనే కారెక్కారు.

ఆ బంగళాని ఎవరో జమీందారు వంశస్థుడు కొన్నాడు. సముద్రానికి దగ్గరని, వేసంగిలో చల్లగా ఉంటుందని, కొత్త యజమాని ఆ ఇంటిని ఇష్టపడ్డాడు గాని, కాపురం ఉండాలని కొనలేదు. వేసవిలో మాత్రం మొత్తం కుటుంబం వచ్చి వుండేవారు. వాళ్లు ఉన్నప్పుడు ఇల్లంతా హడావుడిగా ఉన్నా, మిగతా సమయంలో బంగళాకి, తోటకి ఒక కాపలాదారు మాత్రం వుండేవాడు. ఒకసారి బంగళా కొత్త యజమాని మనవరాల్ని దురదృష్ట వశాత్తు ఓ పాము కరిచింది. ఆ పాప అతి కష్టం మీద, వెంటనే జట్కా మీద దగ్గరలోనే ఉన్న పెద్దాసుపత్రికి తీసుకెళ్లడం వల్ల బతికింది. కానీ, ఆ సంఘటన తర్వాత, కొత్త యజమాని అక్కడికి రావడం తగ్గించేశాడు. అపుడపుడు యజమాని కొడుకు మాత్రం తన మిత్రులతో పేకాట ఆడటానికి, ఇంకా ఏవో జల్సాలు చేయడానికి, బంగళాకి వచ్చేవాడు.

రోజులు సజావుగా నడుస్తుంటే కథేం వుంది? ఇరవయ్యో శతాబ్దంలో ఎనభయ్యో దశకం ప్రారంభమైంది. పట్టణం విస్తరించింది. రేపు పెద్దదైంది. ఫ్యాక్టరీ లొచ్చాయి. ఆఫీసులొచ్చాయి. జనం వలసలు మొదలయ్యాయి. పొట్ట కూటి కోసమో, లాభాల వేటలోనో జనం విరగబడ్డారు. 'పట్టణం' ఊరు పేరులో మిగిలినా, ఊరు 'నగరం'గా మారింది. వాహనాలు పెరిగాయి. కిటకిటలాడుతున్న జనంతో బస్సులు మా తోట గోడ పక్క నించి పోవడం మొదలైంది. రోడ్డు పెరిగింది. తీవ్రంగా రోడ్డు మా గోడకి మరీ దగ్గరగా వచ్చింది.

చూస్తూండగానే తొంభయ్యో దశకం...

ఏదో కనిపించని పెనుమార్పు వచ్చింది. ఏవో సంస్కరణలట... ప్రపంచీకరణట... రోడ్డు మీదకి కార్లు మిడతల దండులా పడ్డాయి. రోడ్డు సరిపోవడం లేదు. మా తోట గోడ కూలిపోయింది. దానికి ఆనుకుని వున్న చెట్లు నేలకొరిగాయి. కొత్త గోడ బాగా లోనికి వచ్చేసింది. నేనిప్పుడు తోటలో లేను, గోడ దాటి, రోడ్డు పక్కగా ఉన్నాను. నాలో ఏదో అభద్రత. ఒకప్పుడు తోటలో ప్రహరీ రక్షణలో, తోటమాలి కాపలాతో ఉండేదాన్ని. ఇప్పుడు రోడ్డు మీద, ఏ రక్షణా లేకుండా ఉంటే, భయం కాక మరేమటి కలుగుతుంది? తోటలో మిగిలిపోయిన నా తోటి చెట్లని చూస్తే, నాకు చెడ్డ అసూయగా ఉంది.

తొంభయ్యో దశకం కాలగర్భంలో కలిసింది. కొత్త శతాబ్ది అవతరించింది. ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారి కన్ను మా తోట మీద పడింది. యజమానికి ఏటా వచ్చే కొద్దిపాటి ఫలసాయం తప్ప, పెద్దగా ఉపయోగం ఉండేది కాదు.

**ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధం- ఎ.ఐ.కె.ఎఫ్. (అమెరికా) కలిసి నిర్వహించిన దీపావళి కథల పోటీలో సాధారణప్రచురణకు స్వీకరించిన కథ**



కథా నిలయం
శ్రీకాకుళం

కాని ఆ తోటలో అంతస్థుల బిల్డింగ్ కట్టి కోట్లు సంపాదించ వచ్చుని, రియల్ ఎస్టేట్ వ్యాపారి ఇట్టే అంచనా కొచ్చాడు. పైగా అది సముద్రానికి బాగా దగ్గర ప్రాంతం. సముద్రానికి దగ్గరగా నివాసం ఇప్పటి క్రేజ్ కదా! పైన జనం ఉండటానికి డీలక్స్ అపార్ట్‌మెంట్లు, కింద షాపింగ్ కాంప్లెక్స్ కట్టి, కోట్లు గడించవచ్చు.

ఆ తోటని తెల్లవారి నించి కొన్న యజమాని ఎపుడో చనిపోయాడు. ఇపుడు ఆయన కొడుకు హయాం నడుస్తోంది. ఆయనకి ఇప్పటికే, అప్పట్లో టౌన్లో తండ్రి కట్టిన సినిమా హాలు నడవక, షాపింగ్ కాంప్లెక్స్‌గా మార్చిన అనుభవం వుంది. రియల్ ఎస్టేట్ వ్యాపారి బంగళా యజమాని ప్రతిపాదన అతని కెంతో నచ్చింది. భాగస్వామిగా ఉంటానని ప్రతిపాదించాడు, బంగళా యజమాని. కాని దానికి రియల్ ఎస్టేట్ వ్యాపారి అంగీకరించలేదు. డబ్బు విరజిమ్మి బంగళాని తన హస్తగతం చేసుకునేవరకు అతనికి నిద్ర పట్టలేదు.

ఇక చూసుకోండి... బుల్ డోజర్లు, కోత యంత్రాలు అక్కడ విలయం సృష్టించాయి. నేను గోడ బయటికి నెట్టబడి, తోటలోనే ఉండిపోయిన నా సాటి చెట్లంటే ఎంతో అసూయ పడేదాన్ని అన్నాను కదా... కాని, నేనలా రోడ్డు మీదికి నెట్టబడటం వల్లనే, నా ప్రాణాలు కాపాడుకోగలిగాను. తోటలోని చెట్లన్నీ నేను చూస్తుండగానే నేలమట్టమ య్యాయి. పచ్చగా కొన్ని దశాబ్దాల పాటు కళకళలాడిన ఆ ప్రాంతం, సిమెంటు, రాళ్లు, స్టీలు ఊచలతో నిండిపోయి, బీభత్సంగా తయారైపోయింది. నా ప్రాణాలు ఏదో విధంగా నిలబడినందుకు ఆనందిం చాలో, నా సాటి చెట్లు నా కళ్ల ముందే కూలిపోయినందుకు దుఃఖపడాలో, నేను తేల్చుకోలేకపోయాను. మొత్తం తోటకి నేనొక్కదాన్నే మిగిలాను, జీవచ్ఛవంలా. ఇక కిలకిలారావాలతో తోటని అనుక్షణం పులకింపజేసే పక్షులు, క్రిమికీటకాదులు ఏమయ్యాయో!

ఆర్నెల్లు తిరక్కుండానే అక్కడో పెద్ద ఎపార్ట్‌మెంట్, కింద షాపింగ్ కాంప్లెక్స్. దానిలో కార్లు, స్కూటర్ల షో రూం. అద్దాలతో మెరిసిపోతున్న ఆ దివ్యభవనాన్ని అటు వెళ్లేవాళ్లంతా చూస్తూ కళ్లు తిప్పుకోలేకపోతున్నారు.

ఇప్పుడు ఆ బిల్డింగ్ ముందు నేను, ఎప్పుడేం జరుగుతుందోనన్న భయంతో, అనుక్షణం. నన్ను బిల్డింగ్ వాళ్లు, బహుశా వాళ్ల ఇంటి డ్రాయింగ్ రూంలోని ప్లాస్టిక్ ప్లాంట్‌లా భావిస్తున్నారు కాబోలు, నా చుట్టూ సిమ్మెంట్‌తో గుండ్రటి దిమ్మ కట్టి, దానికి వెల్ల వేశారు. పండగలకి, పబ్బాలకి, జండాలు కట్టడం, రంగురంగుల విద్యుత్ బల్బులు వేలాడదీయడం చేస్తున్నారు.

ఇక అలాగే సాగితే, కథేంటి?

ఇక కర్మ కాలి, తేనెటీగలు నా కొమ్మ నొకదాన్ని ఆశ్రయించి తేనెతుట్టెని పెట్టాయి. అది పైన వుండటం వల్ల, ఎవరూ పట్టించుకోలేదు. కాని, తేనెటీగలు తరచుగా అక్కడ తేనెపట్టుని పెడుతూనే ఉన్నాయి. పైగా షాపింగ్ కాంప్లెక్స్‌లో కార్ల షో రూం వుండటం, నిత్యం అక్కడ జనకోలాహలం వుండటం వల్ల, ఏదో రకంగా తేనెటీగలు చెదిరి ఒకటి-రెండుసార్లు జనం మీద పడి, వాళ్లని కకావికలు చేశాయి.

ఓ రోజు హఠాత్తుగా పగ్గాలు, రంపాలతో కూలివాళ్లు వచ్చారు. నా చుట్టూ తిరిగి పరిశీలించడం మొదలెట్టారు. అయ్యో! భగవంతుడా! నా పని అయిపోయింది. కొంత సేపటికే ముక్కలు ముక్కలుగా నరక బడ్డాను. సరిగ్గా నేను ఉండే చోటులోనే, కనకాంబరం రంగులో ఉన్న ప్లాస్టిక్ ఈత చెట్టు ప్రతిష్ఠ జరిగింది.

అది రాత్రుల్లో విచిత్రంగా వెలుగుతోంది కూడా. అటూ ఇటూ వెళ్లే జనం, ఆగి మరీ దాన్ని చూస్తున్నారు. ఇంకా భూమిలో మిగిలిపోయిన నా వేళ్లలోని ప్రాణం దీన్నంతా గమనిస్తోంది.

మనుషుల్లో కఠినాత్ముల్ని పాషాణ హృదయులనేవారు. కాని రాళ్ల మధ్యన కూడా మొక్కలు మొలుస్తాయి. అందుకే కాబోలు రాతిలో తేమ అన్నారో కవిగారు. కాని మనిషి గుండె రోజురోజుకీ ప్లాస్టిక్ గుండె అయిపోతున్నది. ఇక ధరిత్రిపై మనిషికి తప్ప వేరే జీవులకి చోటు లేదా? తోటి జీవులు లేకుండా మనిషి ఒక్కడే మనగలడా?

తాత్కాలికసుఖాలనే గొడ్డలితో మనిషి, తను వున్న కొమ్మనే నరుక్కుంటున్న మూర్ఖునిలా ప్రవర్తించడం లేదూ?

అనకూడదు గాని, మా ఉసురు వూరికే పోతుందా? ఇప్పటికే ఎన్ని అనర్థాలు అను భవిస్తున్నాడు మనిషి! కరవుకాటకాలు, వరదలు, ఉప్పెనలు, సునామీలు. ఈ మనిషికి జ్ఞానోదయం అవుతుందా ఎప్పటికైనా? నరికినా చిగర్చడం మా చెట్ల లక్షణం. శిశిరంలో ఆకులు రాల్చినా, వసంతం రాగానే పచ్చదనంతో వెలిగిపోవడం మా స్వభావం. ఈ మనుషులు కూడా ఈ మూర్ఖత నుండి బయటపడతారని, వారి కళ్లు తెరచుకుంటా యని ఆశించడం తప్ప మేం ఏం చేయగలం?

ఇప్పుడు నా కథ విన్నారు కదా... వినడం వల్ల ఏమైనా ప్రయోజనం ఉందో లేదో, మీరే తేల్చుకోండి. ■

## యానిమేషన్ ఫిలింగా 'షోలే'

ఆడ్ ఫిలింమేకర్ ప్రీతిష్‌నంది స్థాపించిన ప్రీతిష్‌నంది కమ్యూనికేషన్స్ (పియన్‌సి) అలనాటి షోలే చిత్రానికి రీమేక్ హక్కులు పొందారు. షోలే మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్, పియన్‌సి కలిసి సంయుక్తంగా షోలేను నాలుగు చిత్రాలుగా నిర్మించబోతున్నారు. యానిమేషన్ ఫిలింగానూ, పూర్తి నిడివితో ప్రీక్వెల్‌ను, సీక్వెల్‌ను, ఇంకా పూర్తి సినిమాను ఇతర తారలతో యధాతథంగానూ పునర్నిర్మిస్తారు. ముందుగా యానిమేషన్ ఫిలిం మొదలై, ఈ సంవత్సరాంతంలో షోలే రీమేక్ షూటింగు మొదలవుతుంది. ఇందులో ఎవరు నటిస్తున్నారన్నది తరువాత తెలుస్తుంది.

## పప్పు పాస్ హోగయా అంటున్న గోవిందా

బాగ్‌బన్, బాబుల్ చిత్రాల దర్శకుడు రవిచోప్రా బి.ఆర్.ఫిలింస్ పతాకంపై లారాదత్తా - గోవిందా జంటగా 'పప్పు పాస్ హోగయా' అనే చిత్రాన్ని ప్రారంభిస్తున్నారు. త్వరలో షూటింగు ప్రారంభమయ్యే ఈ సినిమాలో బిగ్ బి అమితాబ్ కూడా నటించే అవకాశాలున్నాయని తెలుస్తోంది.